క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి 'ట్రెండ్ యూత్' చేయూత



ఎస్ఎస్ తాడ్వాయి : మండల కేంద్రానికి చెందిన లైబ్రేరియన్ ఆలెం కోదండపాణి కుటుంబానికి స్థానిక ఎస్టీ కాలనీకి చెందిన ట్రెండ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేయూత అందించారు. తొలుత కోదండపాణి కుటుంబాన్ని యూత్ అధ్యక్షుడు తాటి నరేశ్ ఆదివారం పరామర్శించారు. క్వింటాన్నర బియ్యంతోపాటు వెయ్యి రూపాయలు నగదు అందజేశారు. అలాగే రెడ్డిగూడెంకు చెందిన కొలిపాక సత్యం బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇర్ప సునిల్, యూత్ సభ్యులు మోకాళ్ల వెంకటేశ్, బాలాజీ, గ్రామ పెద్దలు ఊకె రామయ్య, తాటి రాంచంద్రు, ఇర్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు రగ్గుల పంపిణీ



వెంకటాపురం (కె) : మండలంలోని ఆలుబాక గ్రామంలోని జీసస్ మిషన్ చర్చిలో పాస్టర్ జయరామ్ ఆధ్వర్యంలో 120 నిరుపేద కుటుంబాలకు ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి జానకిరాములు–సత్యవతి సహకారంతో ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. అనంతరం 70 మంది చిన్నారులకు నూతన దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాధన, పూజారి చిన్న సమ్మయ్య, జీవన జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మంగపేట : మండలంలోని కమలాపురంలోని ఫాతిమా చికెన్ సెంటర్ ఎదుట ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లూరు గ్రామానికి చెందిన యాకూబ్‌పాషా అనే యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మల్లూరు గ్రామానికి చెందిన యాకూబ్ పాషా తన ద్విచక్ర వాహనంపై ఏటూరునాగారం మల్లూరుకు తిరిగి వస్తున్న క్రమంలో మార్గమధ్యలోని కమలాపురంలోని ఫాతిమా చికెన్ సెంటర్ ఎదుట రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై పడుకుని ఉన్న లేగదూడను ఢీకొట్టి కింద పడిపోయాడు. యాకూబ్ పాషా తలకు బలంగా దెబ్బ తాకడంతో తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకోగా స్థానికులు ఇచ్చిన సమచారం మేరకు 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని యాకూబ్‌పాషాను ఏటూరునాగారంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ బాధితునికి ఏటూరునాగారం ఆస్పత్రి వైద్యులు ప్రాథమిక వైద్య చికిత్స చేసి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు.

'ఉపసర్పంచ్‌కి బిల్లులకు సంబంధం లేదు'

కాటారం : మండలంలోని చిద్నెపల్లి గ్రామ ఉపసర్పంచ్ బాల్నె తిరుపతి ఆత్మహత్యకు పంచాయతీ బిల్లుల చెల్లింపులకు సంబంధం లేదని మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) ఉపేంద్రయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లుల కోసం ఉపసర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నారనే వార్తలు అవాస్తవమని ఆయన పేర్కొన్నారు. ఉపసర్పంచ్ తన భార్య చనిపోయినప్పటి నుంచి మానసిక వేదనను అనుభవిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.2,56,339లు గ్రామపంచాయతీ ఖాతాలో జమ అయినట్లు వివరించారు. అందులో నుంచి రూ.1,52,042లు పెండింగ్ బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. ఇప్పటికీ రూ.1,03,697 లు గ్రామపంచాయతీ ఖాతాలో నిల్వ ఉన్నట్లు ఎంపీఓ వివరించారు. రైతువేదికకు సంబంధించి అదనపు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారని, పూర్తి వివరాలు సమర్పించాలని చెప్పినా ఇప్పటివరకు ఇవ్వలేదని తెలిపారు. బిల్లులు చెల్లించకపోవడం వల్లే ఉపసర్పంచ్ ఆత్మహత్యకు పాల్పడ్డట్టు సర్పంచ్ కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని వివరించారు. అసత్య ప్రచారాలను పూర్తిగా ఖండిస్తున్నట్లు ఎంపీఓ పేర్కొన్నారు.

నేడు వైకుంఠ ఏకాదశి

టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు(సోమవారం) ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకలను నిర్వహించనున్నట్లు సర్పంచ్ వెలిశెట్టి స్వర్ణలత సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

యాసంగి వరి నాట్లు షురూ

తగ్గిన కమర్షియల్ సాగు
- ఎంటీయూ 1001పై అనాసక్తి
- బాండ్ వైపే మొగ్గు



నాట్లు వేస్తున్న కూలీలు



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతులు

వాజేడు : మండలవ్యాప్తంగా యాసంగి వరి నాట్లు మొదలయ్యాయి. 1001 రకం ధాన్యాన్ని వానాకాలంలో పండించిన రైతులు ఈసారి పూర్తిగా మానేశారు. సన్న రకాలైన 1010, 1156, 1271, కూనవరం సన్నాలు, 64, 1061, 1064, బతుకమ్మ, ఆర్ఎన్ఆర్ రకాల వైపు మొగ్గు చూపారు. నార్లు పెరగడంతో నాట్లు ప్రారంభించారు. అయితే ఎక్కువగా బాండ్‌వరి సాగు వైపే అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు.

తగ్గిన కమర్షియల్ సాగు

ఏటా కమర్షియల్ సాగు వైపు మొగ్గు చూపే రైతులు ఈసారి బాండ్ వరితోపాటు మొక్కజొన్న, ఇతర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. 1001 రకం వరి పంటను యాసంగిలో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందో? లేదో ? అన్న అనుమానం కూడా వరి పంట తగ్గడానికి కారణంగా కనపడుతోంది. 1001 రకాన్ని సాగు చేయొద్దనే ఆలోచనలో రైతులు ఇతర రకాల విత్తనాలను వేస్తున్నారు.

బాండ్ వైపే మొగ్గు

వర్షాకాలం దిగుబడి భారీగా తగ్గడంతో రైతుల్లో వరి సాగుపై ఆసక్తి తగ్గింది. దీంతో బాండ్ వరి పంట వైపు మొగ్గు చూపారు. అందులో భాగంగానే మండలంలో బాండ్ వరి సాగు విస్తీర్ణం పెరిగింది. అంతేకాకుండా వరి పంటను సాగు చేసే పొలాల్లో బాండ్ మొక్కజొన్నను కూడా సాగు చేస్తున్నారు. ఇప్పటికే బాండ్ మొక్కజొన్న పెట్టగా ఇప్పుడు బాండ్ వరి నాట్లను వేస్తున్నారు. ఒకవైపు దుక్కులు చేస్తున్న రైతులు వరి నాట్లు వేస్తూ బిజీ అయిపోయారు. ఈ క్రమంలోనే పలు కంపెనీలకు చెందిన విత్తనాలతో వరి నాట్లు ప్రారంభించారు. మండలవ్యాప్తంగా గతేడాది 4 వేల ఎకరాల్లో యాసంగి సాగు చేయగా ఈ ఏడాది సుమారు 2 వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్టు తెలుస్తోంది. బాండ్‌పై మరో 800 ఎకరాల్లో వరి నాట్లను వేయనుండగా 600 ఎకరాల్లో ఇప్పటికే బాండ్ మొక్కజొన్న వేశారు. కాగా వ్యవసాయ పనులను ముమ్మరం చేసి నాట్లను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటికే ట్రాక్టర్లతో దమ్ము చేసిన రైతులు గుత్తా నాట్లు వేస్తున్నారు.

క్రీడాకారులకు టీ షర్టుల పంపిణీ



టీ షర్టులు పంపిణీ చేస్తున్న రవీందర్

గణపురం: మండలకేంద్రంలోని క్రీడాకారులకు అదే గ్రామానికి చెందిన పబ్బ రవీందర్ టీ షర్టులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారగాని దేవేందర్ గౌడ్, ఉపసర్పంచ్ పోతర్ల అశోక్, బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బోయిని సాంబయ్య, గణపురం పట్టణ అధ్యక్షుడు గుర్రం తిరుపతి, యంగ్‌స్టార్ యూత్ క్రీడాకారులు మామిడిశెట్టి రవీందర్, మోటపోతుల చందర్ గౌడ్, యాంసాని రాజన్న, తిరుపతి, మల్లేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'రానున్నది బీజేపీ ప్రభుత్వమే'



టేకుమట్ల(రేగొండ) : రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. ఆదివారం రేగొండ మండలంలోని రాయపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని, పలు పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. అందులో భాగంగానే యువ నాయకుడు నీటూరి శ్రీను బీజేపీలో చేరినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. ఆమె వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపన్న, నాయకులు దాట్ల ఐలయ్య, దాట్ల రమేష్, వీసం దేవేందర్‌రెడ్డి, జాలిగపు నరేందర్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలో పాల్గొన్న జెడ్పీటీసీ సాగర్, నాయకులు

చిట్యాల: మండలంలోని నాపాక లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల జాతరను జెడ్పీటీసీ గొర్రె సాగర్ ఆదివారం ప్రారంభించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో జెడ్పీటీసీ పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్య వచనము, హోమం కార్యక్రమం చేపట్టారు. నేడు(సోమవారం) ఆలయంలో తూర్పు ద్వారా దర్శనం, కల్యాణ మహోత్సవ కార్యక్రమం, అన్న ప్రసాదములు, కోలాట ప్రదర్శనలు నిర్వహించడంతో జాతర ముగుస్తుందని, జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని దేవాలయ చైర్మన్ బీరవోలు రాంరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రభాకర చార్యులు, రమేష్, నిర్వహకులు సంపత్ రెడ్డి, దుద్దుకూరి పుష్పనీల, రవీందర్, మహేందర్, మాసు రమేష్, కట్కూరి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.


కమిటీ ఎన్నిక

చిట్యాల: మండల కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా గుమ్మడి సత్యనారాయణ, అధ్యక్షుడిగా బుర్ర లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యక్షులుగా సరిగొమ్ముల సదయ్య, తాటికంటి రాజు కుమార్, ప్రధాన కార్యదర్శిగా అంకం సురేష్, సహాయ కార్యదర్శులుగా చిలుముల రాజమౌళి, బైరం రామకృష్ణ, కోశాధికారిగా మొలుగురి కుమార్, ప్రచార కార్యదర్శిగా బుర్ర కృష్ణ, సంకెండ్ల రమేష్, సభ్యులుగా శనిగరపు మొగిలి, దాసరపు సాంబయ్య, బుర్ర రఘు, ఈగ కోటి, పాత సత్యనారాయణ, మైదం రాజకుమార్, గంగాధర్ రవి, బుర్ర కరుణాకర్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, దివ్యాంగుల జిల్లా కమిటీ అధ్యక్షుడు కొడారి సారయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, మండల మహిళా అధ్యక్షురాలు మెరుగు లక్ష్మి, ఎంపీటీసీ దబ్బెట అనిల్, శ్రీనివాస్ గౌడ్ దొడ్డి కిష్టయ్య, కుమార్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చించిన వారిపై చర్య తీసుకోవాలి

నర్సంపేట : పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను శనివారం రాత్రి చించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు ప్రభుత్వంపై విరక్తి చెందారని తెలిపారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేకచే కొంత మంది అధికార పార్టీ నాయకుని అండదండలతో అమాయకులను పురమాయించి అర్ధరాత్రి వేళ చింపి వేశారని ఆరోపించారు. ఫ్లెక్సీలను చించేసి విష సంస్కృతికి ఆద్యం పోసే నాయకుని చెంప చెల్లుమనిపించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పోలీసులు చిత్తశుద్ధితో దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, నాయకులు ములుకల సాంబయ్య, వేముల సారంగంగౌడ్, దండెం రతన్‌కుమార్, యూత్ నాయకులు ఉత్తంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరామకృష్ణ' చైర్మన్ జన్మదిన వేడుకలు



రాజుపేట బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ నాగరమేశ్

మంగపేట : మండలంలోని రాజుపేటలో శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగరమేశ్ జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. రమణక్కపేట, రాజుపేట యూత్ కమిటీల ఆధ్వర్యంలో ఆయన ఇంటి నుంచి సుమారు 200 మంది యువకులు, ట్రస్ట్ సభ్యులు ద్విచక్ర వాహనాలపై రమణక్కపేట వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం యువత, గ్రామస్తులు ఆయన్ను గజమాలతో సత్కరించి శాలువాతో సన్మానించారు. తదనంతరం యూత్ ఆధ్వర్యంలో రమణక్కపేట, రాజుపేట బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా అభిమానులు, శ్రేయోభిలాషులు నాగరమేశ్‌కు జన్మదిన, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాగరమేశ్ ఇంటి వద్ద నిర్వహించిన వేడుకలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు హాజరై ఆయన్ను శాలువాతో సన్మానించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీజేపీ అనుబంధ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మినారాయణ హాజరై మాట్లాడారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా సమాజసేవే కర్తవ్యంగా పేదలు, వృద్ధులు, వికలాంగులకు, అభాగ్యులకు నాగరమేశ్ సేవలు అందిస్తున్నారని తెలిపారు. నాగరమేశ్ జన్మదిన వేడుకల్లో భాగంగా తిమ్మంపేట, మంగపేటల్లోని కస్తూర్బా వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మంగపేట పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బోరునర్సాపురంలో పిచ్చమ్మ అనే వృద్ధురాలికి వీల్‌చైర్ అందించారు. కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు లొడె శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు అల్లె జనార్దన్, హేమాచల క్షేత్రం మాజీ చైర్మన్ ముగులుట్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు గద్దల రఘు, నాగుల్ మీరా పాషా, మల్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిట్టిమళ్ల సమ్మయ్య, గుండేటి రాజు, ఎడ్లపల్లి నర్సింహారావు, ప్రముఖులు తుమ్మల సుధాకర బెనర్జీ, సుభాకర ముఖర్జీ, ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు పొదెం కృష్ణప్రసాద్, కొమరం నర్సయ్య, కొమరం మాధవరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కొమరం ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి



ఏటూరునాగారం : మాట్లాడుతున్న జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ సలీమ్



వెంకటాపురం (కె) : మండల కేంద్రంలోని చర్చిలో..



వాజేడు : ముగ్గులు వేస్తున్న మహిళలు



మంగపేట : కమలాపురం అపోస్తుల చర్చిలో కేక్ కట్ చేస్తున్న సోమయ్య



మంగపేట : కమలాపురం సీయోను చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

ములుగు ఎమ్మెల్యే సీతక్క
- ఊరూరా నూతన సంవత్సర వేడుకలు

ములుగు : నూతన సంవత్సరంలో అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆకాంక్షించారు. జిల్లాలోని ఊరూరా ఆదివారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు సీతక్క హాజరై కేక్ కట్ చేసి శ్రేణులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఇక నుంచి ప్రజలకు మరింత అందుబాటులో ఉంటానని చెప్పారు. ఎలాంటి సమస్యలున్నా తనను నేరుగా సంప్రదించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నం భద్రయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు దేవ్‌సింగ్, యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వంశీ, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మధు, కిశోర్, వార్డు సభ్యులు కృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని జీసస్ సేవ్స్ మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ ఎలియాజర్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ సలీమ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు వినియోగించుకోవాలని సూచించారు. క్రైస్తవులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సాల్మన్ బ్యూల, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం (కె) : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రజలు శనివారం అర్ధరాత్రి వేడుకలు జరుపుకున్నారు. ఇండ్ల ముందు ముగ్గులు వేసి అలంకరించారు. కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని సందడి చేశారు. ఆదివారం మండలంలోని బోదాపురం చర్చిలో పాస్టర్ లూకా, వెంకటాపురం సెంటినరీ మెతడిస్ట్ చర్చిలో పాస్టర్ విజయ్‌చందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో విలేకరులు కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు చేశారు.

వాజేడు : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. గుంపులుగా, ర్యాలీలు నిషేధిస్తూ ప్రభుత్వ నిబంధనలు ఉండటంతో నూతన సంవత్సర వేడుకలు ఇళ్ల వద్దే జరుపుకున్నారు. ఇళ్ల ముంగిళ్లను ముగ్గులతో అలంకరించారు.

మంగపేట : మండలంలోని కమలాపురంలోని అపోస్తుల చర్చిలో పాస్టర్ ఆదామ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య కేక్ కట్ చేసి పేద క్రైస్తవులకు, వృద్ధులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని సియోను చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తోట అశోక్‌కుమార్, పడమటింటి శ్రీనివాస్, పాస్టర్లు జాషువా, కిన్నెర, దేవరాజు, కృపానిధి, జోయల్, యూసఫ్, థామస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగేశ్వర్‌రావు

ఎస్ఎస్ తాడ్వాయి : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని గంగారం సర్పంచ్ గౌరబోయిన నాగేశ్వర్‌రావు కోరారు. మండలంలోని గంగారం గ్రామంలో సమ్మక్క సారక్క ఆదివాసీ పొదుపు సంఘం, మార్కెటింగ్ పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. మండలంలోని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. దళారులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రం సంఘం ప్రెసిడెంట్ కొర్నబెల్లి గణేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుందారపు లాలయ్య, రైతులు మేడిశెట్టి నర్సింహులు, లక్ష్మయ్య, రాములు, నర్సింగరావు, రాము, బిక్షపతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం



మొగుళ్లపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరావు



రేగొండలో 2023 క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి : ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి అధ్యక్షతన అన్ని గ్రామాల ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో పేదవారు బ్రతకలేని పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందని అన్నారు. గడచిన ఎనిమిదేళ్లలో ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ దుర్మార్గమైన పాలన చేస్తున్నారని ఆరోపించారు. దేశానికి దశాదిశ నిర్దేశించగల బలమైన నాయకుడు రాహుల్ గాంధీయేనని అన్నారు. ఈ సమావేశంలో గ్రామ అధ్యక్షుడు క్యాతరాజు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు పోల్నేని లింగారావు, మండ రవీందర్, తక్కళ్లపల్లి రాజు, దేవేందర్ రెడ్డి, నీరటి మహేందర్, నీల రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ.

టేకుమట్ల(రేగొండ): కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్, దేవేందర్ రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు మండల అధ్యక్షుడు నర్సయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి తిరుపతి, మేకల భిక్షపతి, కొలెపాక సాంబయ్య, రావుల సందీప్, అజ్మీరా బిందురామ్, బండి పవన్, రావుల రాకేష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

మొగుళ్లపల్లి : మండలంలోని వేములపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు గుత్తికొండ సాంబయ్య గ్రామంలోని విద్యార్థులకు ఆదివారం బాల్ బ్యాడ్మింటన్ బ్యాట్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. విద్యార్థులు చదువుల్లో, ఆటపాటల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని సూచించారు.

అయ్యప్ప పడిపూజ

నర్సంపేట : శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ రజని గుప్తా ఆధ్వర్యంలో పుష్పాభిషేక పడిపూజ మహోత్సవం ఆదివారం నిర్వహించారు. పడిపూజ దాత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి సునంద దంపతులు అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు.